క్లుప్తంగా

కృత్రిమ ఎరువు తయారు చేయాలి



కంబదూరులో ఎస్‌డబ్ల్యూపీ షెడ్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

కళ్యాణదుర్గం (కంబదూరు): రైతులకు మేలు చేసే కృత్రిమ ఎరువు తయారు చేయాలని జెడ్పీ సీఈఓ శివశంకర్ తెలిపారు. శుక్రవారం కంబదూరు మండల కేంద్రంలోని స్వచ్ఛభారత్ (ఎస్‌డబ్ల్యూపీ) వర్మీషెడ్‌ను జెడ్పీ సీఈఓ శివశంకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వర్మీషెడ్లు రైతులకు ఉపయోగపడేలా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నేల సారవంతాన్ని పెంచి వర్మీకంపోస్టు ఎరువులో వానపాములను పెంచుతూ రైతులకు మేలు చేసేలా కృత్రిమ ఎరువు తయారు చేయాలన్నారు. కొత్తగా నిర్మించనున్న మురుగునీటి కాలువలను, సీసీ రోడ్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తిప్పయ్య, ఈఓఆర్డీ లీలాబాయి, స్థానిక నాయకుడు తిమ్మప్ప, పంచాయతీ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

రాయితీతో గడ్డి జొన్నల పంపిణీ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని పశువైద్యశాలలో శుక్రవారం ఏడీఏ శ్రీనివాసగుప్త ఆధ్వర్యంలో పాడి రైతులకు రాయితీ గడ్డి జొన్నలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే రాయితీ గడ్డిజొన్నలు కావాల్సిన రైతులు 5 కేజీల సంచి రూ. 460 ఉండగా, రాయితీ 75 శాతం పోనూ రూ.115 చెల్లించాలన్నారు. గరిష్టంగా రైతులకు 20కేజీలు అందిస్తామన్నారు. రైతులు సమీపంలో రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

5న పాలీసెట్ స్పాట్ అడ్మిషన్లు

కళ్యాణదుర్గం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (బోరంపల్లి)లో మొదటి సంవత్సరం సివిల్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్, ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.తిప్పేస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 4న సాయంత్రం 3 గంటల లోపు ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను కళాశాలలో అందజేయాలన్నారు. పాలీసెట్ హాల్ టికెట్, పాలీసెట్ ర్యాంక్ కార్డు, పదో తరగతి మార్కులు జాబితా, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కులధ్రువీకరణ పత్రం, రెసిడెన్స్ సర్టిఫికెట్, నాన్ లోకల్ అభ్యర్థులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ (ఓసీ అభ్యర్థులకు), టీసీ తీసుకురావాలన్నారు. విద్యార్థి ఆధార్ కార్డు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు 3 సెట్ల జిరాక్స్ పత్రాలు, 2 పాస్ పోర్టుసైజ్ ఫొటోలతో పాటు కోర్సు ఫీజు రూ.5,800 తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు సెల్: 9505504207, 9989650049, 9346402280లో సంప్రదించాలన్నారు.

ఓపెన్ జిమ్ పరిసరాలు శుభ్రం



ఓపెన్ జిమ్ పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

ఉరవకొండ రూరల్: పట్టణంలోని ఓపెన్ జిమ్ పరిసరాలను పంచాయతీ అధికారులు శుక్రవారం శుభ్రం చేయించారు. 'నిరుపయోగంగా ఓపెన్ జిమ్ ' శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైంది. స్పందించిన మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ పంచాయతీ పారిశుధ్య కార్మికులతో ఓపెన్ జిమ్ పరిసరాల్లోని ముళ్ల కంపలను తొలగించారు. ఓపెన్ జిమ్ ఉపయోగాలను స్థానికులకు అవగాహన కల్పిస్తామన్నారు.

రైతులపై కూటమి ప్రభుత్వం కపటప్రేమ



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ జిల్లా కోశాధికారి రాయుడు

కూడేరు: కూటమి ప్రభుత్వం రైతులపై కపట ప్రేమ చూపుతోందని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి రాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు చంద్రబాబు మాట్లాడుతూ అధికారంలోకొస్తే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పంట పెట్టుబడి సాయాన్ని పెంచి, ఒకే విడతలో రైతుల ఖాతాల్లోకి జమ చేస్తామని చెప్పారన్నారు. వేరుశనగ అదను దాటిపోయినా ఇంత వరకూ రైతుల ఖాతాల్లో పంట పెట్టుబడి సాయం జమ చేసేంది లేదని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించకపోతే అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ముంచిన మచ్చ తెగులు



ఈ రైతు పేరు రామాంజనేయులు. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామం. ఈయన రెండున్నర ఎకరాల్లో టమాట పంట సాగు చేశాడు. ఇప్పటికే దాదాపు రూ.2లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. ఇప్పటికీ సుమారు 500 బాక్సుల టమాటాలు మార్కెట్‌కు తరలించాడు. పంటకు ఎన్ని మందులు పిచికారీ చేసినా మచ్చ తెగులు పోవడంలేదు. పంటకు తెగులు లేకుండా ఉండి ఉంటే ఈఏడాది మంచి రాబడి వచ్చేదని రైతు చెప్తున్నాడు.

- టమాట రైతులను వేధిస్తున్న తెగుళ్ల బెడద
- ధర ఆశాజనకంగా ఉన్నా దిగుబడి అంతంత మాత్రమే
- డివిజన్‌లో 10,225 ఎకరాల్లో పంటసాగు
- జాగ్రత్తలు పాటించాలంటున్న శాస్త్రవేత్తలు

కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్‌లో టమాట సాగు ఇలా...

మండలం	సాగు చేసిన టమాట (ఎకరాలలో..)
కళ్యాణదుర్గం	5,500
కంబదూరు	1,450
కుందుర్పి	1,350
శెట్టూరు	1,265
బ్రహ్మసముద్రం	660
మొత్తం	10,225

కళ్యాణదుర్గం: ఏటేటా వర్షాధార పంటలు సాగు చేసి నష్టాలు చవిచూస్తున్న రైతులు.. ప్రత్యామ్నాయ పంటలు ఆదుకుంటాయనుకుంటే తీరా చేతికందివచ్చిన తర్వాత తెగుళ్ల బెడద వేధిస్తోంది. ధరలు ఆశాజనకంగా ఉన్నా.. దిగుబడి అంతంత మాత్రంగా ఉండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. నెల రోజులుగా టమాట ధరలు రైతులకు ఊరటనిస్తున్నా.. వాతావరణంలో ప్రతికూల పరిస్థితులతో టమాట పంటకు మచ్చ తెగులు సోకింది. దీంతో వంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ధరలు ఆశాజనకం... లాభాలు అంతంత మాత్రమే..!

ఎకరం టమాట పంట సాగు చేసేందుకు సుమారు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పెట్టుబడి అవసరం అవుతుంది. అయితే ప్రస్తుతం అనంతపురం, మదనపల్లి, కోలార్ ప్రాంతాల మార్కెట్‌లలో 15 కిలోల టమాట బాక్సు ధర నిన్న, మొన్నటి వరకు రూ.300 నుంచి రూ.400 వరకు పలికింది. 30 కిలోల బాక్సు రూ.600 నుంచి రూ.1,100 వరకు ధర పలికింది. దీంతో ధరలు ఆశాజనకంగా ఉన్నా దిగుబడిలేక రాబడి అంతంతమాత్రంగా ఉండడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. పంటకు మచ్చ తెగుళ్ల ఆశించకుండా ఉండి ఉంటే ఈ సారి టమాట రైతులకు మంచి లాభాలు అందేవి.

మచ్చ తెగుళ్లతో పంటకు తీవ్ర నష్టం

వాతావరణంలో ప్రతికూల మార్పులతో టమాట రైతులు కుదేలవుతున్నారు. మచ్చ తెగులు ఆశించడంతో అధిక మొత్తంలో మచ్చ తెగుళ్ల సోకిన టమాటాలను రైతులు పారబోస్తున్నారు. 15 కిలోలు నాణ్యతగా ఉంటే సుమారు 40 కిలోల మేర మచ్చ తెగులు బారిన పడుతోంది. దీంతో పొలాల్లోనే రైతులు మచ్చ తెగులు బారిన పడిన టమాటాలను తొలగించి, అక్కడికక్కడే పారబోస్తున్నారు.



ఒంటిమిద్ది వద్ద సాగు చేసిన టమాట పంట

నివారణ ఇలా...!

ముఖ్యంగా టమాటాలో ఆకులు, కాండం మీద, కాయలపైన గోధుమ రంగుతో కూడిన మచ్చలు ఏర్పడి, క్రమేణా ఆకులు మాడి, ఎండిపోతాయి. దీనిని ఎర్లిబ్లైట్ అంటారు. దీని నివారణకు 3 గ్రాముల కాప్టాన్ లేదా మాంకోజెబ్ లేదా క్లోరోథలోనిల్ 2 గ్రాములు, లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీల మందు లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధితో మూడు లేక నాలుగు సార్లు పిచికారీ చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు.



ఏపుగా కాసిన టమాట

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి



కడదరకుంటలో మాట్లాడుతున్న జిల్లా ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ నారాయణస్వామి



ఆమిద్యాలలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది



గంగవరంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న ఏసీడీపీఓ ఎల్లమ్మ

కూడేరు: పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా రాష్ట్రీయ బాలల ఆరోగ్య సురక్ష (ఆర్‌బీఎస్‌కే) కోఆర్డినేటర్, జిల్లా ఎన్‌సీడీ సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణస్వామి వైద్య సిబ్బందికి ఆదేశించా రు. శుక్రవారం ఆయన కడదరకుంట ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. రాష్ట్రీయ బాలల ఆరోగ్య సురక్ష ద్వారా పిల్లల ఆరోగ్యం కోసం చేస్తున్న స్క్రీనింగ్ పరీక్షలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఉషారాణి, సరిత, సూపర్‌వైజర్లు యశోధ, రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ కరిష్మా, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

తల్లిపాలతో రోగ నిరోధకశక్తి

బెళుగుప్ప: తల్లిపాలతో రోగ నిరోధకశక్తి పెరుగుతుందని ఉరవకొండ సెక్టార్ ఏసీడీపీఓ యల్లమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని గంగవరంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవితో కలసి తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గ్రామంలో అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించి, అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఏసీడీపీఓ మాట్లాడుతూ చంటి బిడ్డకు పుట్టిన గంట లోపు తల్లిపాలు పట్టించాలని, తద్వారా రోగనిరోధక శక్తిని పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సునీత, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



అప్పిలేపల్లిలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

తల్లి పాలే బిడ్డకు శ్రీరామరక్ష

ఉరవకొండ రూరల్: తల్లి పాలు బిడ్డకు శ్రీరామరక్ష అని రాకెట్ల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తెలిపారు. శుక్రవారం ఆమిద్యాల గ్రామంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. పుట్టిన శిశువుకు ఆరు నెలల వరకు తల్లి పాలను మాత్రమే ఇవ్వాలని, అనంతరం ఇతర పోషక విలువలతో కూడిన ఆహారం ఇవ్వొచ్చని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, నాగమణి పాల్గొన్నారు.

వజ్రకరూరు: తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని సూపర్‌వైజర్ రబియా అన్నారు. శుక్రవారం మం డలంలోని తట్రకల్లు గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమాదేవి, మాణిక్య మ్మ, ఎంఎల్‌హెచ్‌పీ నిర్మల, ఆశా కార్యకర్తలు రుద్రమ్మ, వీరభద్రమ్మ పాల్గొన్నారు.

కుందుర్పి: తల్లిపాలతో చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి సూపర్‌వైజర్ సుశీల తదితరులు పేర్కొన్నారు. శుక్రవారం అప్పిలేపల్లిలో అంగన్‌వాడీ సిబ్బంది తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తల్లిపాల విశిష్టత, పౌష్టికాహారంపై వివరించారు.


ఫ్లోరైడ్‌ను నిర్లక్ష్యం చేస్తే ఎముకలపై ప్రభావం




సూచనలిస్తున్న ఫ్లోరోసిస్ జిల్లా కన్సల్టెంట్ ఆంజనేయులు

కూడేరు: ఫ్లోరైడ్‌ను నిర్లక్ష్యం చేస్తే దంతాలు, ఎముకలు, కీళ్లపై ప్రభావం చూపుతుందని ఫ్లోరోసిస్ జిల్లా నిపుణులు (కన్సల్టెంట్) ఆంజనేయులు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక పీహెచ్‌సీని సందర్శించారు. ఫ్లోరోసిస్ వ్యాధిపై సిబ్బందికి అవగాహన కల్పించారు. తాగే నీటి ద్వారా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలియజేశారు. మోతాదుకు మిచ్చి ఫ్లోరైడ్ ఉన్న నీటిని ప్రజలు తాగొద్దని సూచించారు. ఫ్లోరైడ్ ప్రభావంతో దంతాల ఎనామిల్‌పై మచ్చలు, గీతలు పడడం, రంగు మారతాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నారాయణ స్వామి, వైద్యాధికారిణి ఉషారాణి, సీహెచ్‌ఓ సరోజ, సూపర్‌వైజర్లు రవీంద్ర, యశోద, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వనం పెంచితేనే పచ్చదనం



ధర్మపురి ఫారెస్టులో మొక్కలు నాటుతున్న దృశ్యం



శెట్టూరు నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

- అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కల పెంపకానికి శ్రీకారం
- ఈ ఏడాది 1.33 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- ధర్మపురి, శెట్టూరు, పిల్లలపల్లి బీట్‌లలో వనాలు

రాయదుర్గం: అడవుల విస్తీర్ణం నానాటికీ తగ్గిపోతోంది.. ఉన్న చెట్లు నరికేస్తుండడంతో పచ్చదనం తగ్గిపోతోంది.. ప్రకృతి విపత్తులకు దారితీస్తోంది. మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. మొక్కలు విరివిగా నాటాలి.. పర్యావరణాన్ని పరిరక్షించాలి..ఈ దిశగా కేంద్ర ప్రభుత్వ నిధులతో అటవీశాఖ అధికారులు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో మొక్కల పెంపకాన్ని మొక్కుబడిగా కాకుండా .. ప్రణాళికాబద్ధంగా చేపడితేనే సత్ఫలితాలుంటాయని ప్రజలు, పర్యావరణ ప్రియులు కోరుతున్నారు.

కళ్యాణదుర్గం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, కంబదూరు 3 సెక్షన్లు, 10 బీట్‌లు ఉన్నాయి. వీటి పరిధిలోని 24,380 హెక్టార్లలో అటవీ భూభాగం విస్తరించింది. పర్యావరణ సమతుల్యం ఉండాలంటే మొత్తం భూభాగంలో 33 శాతం అడవులు ఉండాల్సి ఉంది. అటవీ రేంజ్ పరిధిలో నాలుగైదు శాతం మాత్రమే ఉన్నట్టు గణంకాలు చెప్తున్నాయి. ఇందులో దట్టమైన అడవులు ఒక్కచోట మినహా మిగిలిన ప్రాంతాల్లో చిన్న పొదలు, ఖాళీ ప్రదేశంతో పాటు కొద్దిపాటి నీటి వనరులున్నాయి. ఇప్పుడు కొత్తగా అడవుల కోసం భూమిని సేకరించే పరిస్థితి లేనందున ఉన్న ప్రాంతంలోనే మొక్కల పెంపకానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రాయదుర్గం మండలంలోని ధర్మపురం, శెట్టూరు, పిల్లలపల్లి బీట్‌లలో 1.33 లక్షలు నారవేప, తెల్లమద్ది, రాగి, వేప తదితర నీడనిచ్చే మొక్కల పెంపకం చేపట్టారు.

నాటిన మొక్కలన్నీ సంరక్షిస్తాం



అటవీ భూభాగంలో వర్షాధారంగా ఇప్పటికే 1.33 లక్షల మొక్కలు నాటించాం. అన్ని బీట్‌ల లోనూ వనాల సంరక్షణ, పెంచే బాధ్యత అధికారులకు అప్పగించాం. గుండ్లపల్లి, శెట్టూరు, కైరేవు ఫారెస్ట్ నర్సరీల్లోనూ 4.10 లక్షల మొక్కలు పెంపకం చేపట్టాం. ఇందులో 1.33 లక్షలు అటవీ ప్రాంతానికి ఉపయోగించాం. మిగిలిన మొక్కలు ఉపాధిహామీ పథకం కింద నాటేందుకు ఇండెంట్ ఇచ్చాం. రైతులు గట్లు వెంట నాటేందుకు మొక్కలు ఇస్తాం.

– రామచంద్రుడు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, కళ్యాణదుర్గం

నీటి గుంతల్లో గంబూషియా చేప పిల్లల విడుదల



ఉరవకొండలో నీటి గుంతలో గంబూషియా చేప పిల్లలను వదులుతున్న అధికారులు

ఉరవకొండ: మండలంలోని పలు చెరువులతో పాటు స్థానిక చిన్నచెరువు వద్దనున్న నీటి గుంతల్లో గంబోషియా చేపపిల్లలను మండల అధికారులు శుక్రవారం వదిలారు. పట్టణంలోని జైనబ్బీ దర్గా సమీపంలో ఉన్న చిన్న చెరువులో ఎంపీడీఓ రవిప్రసాద్, ఈఓఆర్‌డీ సతీష్‌కుమార్, ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో చేపపిల్లలను వదిలారు. కార్యక్రమంలో వైద్యాధికారి వినీత, హెల్త్ సూపర్‌వైజర్‌లు నిమ్మల వెంకటేష్, తలారి రాఘవేంద్ర పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వజ్రకరూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌ఓ లక్ష్మీదేవి, గ్రామ కార్యదర్శి మల్లయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని కుంటలు, బావులు, నీటి నిల్వ ఉన్న చోట్ల 10 వేల గంబూషియా చేపలను వదిలారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీదేవి, గ్రామ కార్యదర్శి మల్లయ్య, ఎంపీహెచ్‌ఈఓ గురుప్రసాద్, సూపర్‌వైజర్ నాగశంకర్, ఎంఎల్‌హెచ్‌పీ భారతి, హెల్త్‌అసిస్టెంట్‌లు నాగరాజు, సంపత్‌కుమార్, ఆశా కార్యకర్తలు కళావతి, ప్రభావతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన అభివృద్ధివేదిక తాలూకా కమిటీ ఎన్నిక

కుందుర్పి: వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక తాలూకా నూతన కమిటీని శుక్రవారం ఎంపిక చేసినట్లు కమిటీ నూతన అధ్యక్షుడు నిజవల్లి బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా నిజవల్లిబాబు, ప్రధాన కార్యదర్శిగా కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, కార్యదర్శులుగా ములకనూరు గంగాధర, ఉద్దీప్ శింహ, చెలిమప్ప, గొర్లకృష్ణ, ఏ. నరేష్, రవిచంద్రారెడ్డితో పాటు మరో 9 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

జైనబ్బీ ఉరుసు పోస్టర్ల విడుదల



జైనబ్బీ ఉరుసు ఉత్సవాల పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: ఉరవకొండలో ఈనెల 20 నుంచి ప్రారంభమయ్యే హజరత్ బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో దర్గా కమిటీ సభ్యుల సమక్షంలో ఉరుసు పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేను సన్మానించి, ఉరుసు ఆహ్వాన పత్రికను అందించారు. దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరుబాషా, అసోసియేట్ అధ్యక్షుడు పామిడి జాకీర్ మాట్లాడారు. ఈనెల 20న అమ్మవారి గంధం, 21న ఉరుసు, 22న జియారత్ వేడుకలతో ఉత్సవాలు ముగిస్తాయన్నారు. కార్యక్రమంలో దర్గా కమిటీ కార్యదర్శి జీఎంఎస్ షాకీర్, కోశాధికారి జెండాజిలాన్, జాయింట్ సెక్రటరీలు గంగవరం శర్మాస్ వలి, కణేకల్లు యూసుఫ్, గౌరవ సలహా సభ్యుడు బొంబాయిసెట్ మైనుద్దీన్, వన్నూర్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాజీ ఎంపీ రంగయ్య పర్యటన

కళ్యాణదుర్గం రూరల్: మండలంలో మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య శనివారం పర్యటించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. సాయంత్రం 4 గంటలకు గోళ్ల గ్రామం, 5 గంటలకు బోరంపల్లి గ్రామంలో ఆయన పర్యటించనున్నారు. క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు.

వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడిగా డి.రాజేష్

రాయదుర్గంటౌన్: విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడిగా దేవరెడ్డిపల్లి రాజేష్‌ను నియమించారు. ఇటీవల నెల్లూరులో జరిగిన వీహెచ్‌పీ రాష్ట్రస్థాయి సదస్సులో అనంతపురం జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజేష్‌ను ఎంపిక చేశారు. ఈ నెల 5న రాయదుర్గంలో జరిగే జిల్లా స్థాయి వీహెచ్‌పీ సమావేశంలో రాయదుర్గంశాఖ వీహెచ్‌పీ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేయనున్నట్లు రాజేష్ ఓ ప్రకటనలో తెలిపారు.

నన్స్‌ను విడుదల చేయాలి

రాయదుర్గంటౌన్: కేరళకు చెందిన రోమన్ కేథలిక్ క్రిస్టియన్ నన్స్ వందన, ప్రీతిమేరిలను బలవంతపు మతమార్పిడి, మానవ అక్రమ రవాణా ఆరోపణలతో చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో అక్రమ అరెస్ట్ చేయడాన్ని రాయదుర్గం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అక్రమంగా అరెస్ట్ చేసిన నన్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతి కార్డుదారుడికీ బియ్యం ఇవ్వాలి



ఉద్దేహాళ్‌లో రేషన్ షాపును తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే సహించేదిలేదని, ప్రతి కార్డుదారుడికీ బియ్యం సక్రమంగా ఇవ్వాలని తహసీల్దార్ మునివేలు తెలిపారు. శుక్రవారం ఉద్దేహాళ్‌లో రేషన్ షాపులను తనిఖీ చేసి రేషన్ పంపిణీని పరిశీలించారు. బియ్యం పంపిణీ ఎలా జరుగుతుందని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ లోపు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరిచి ఉంచాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకే బియ్యం అందించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో యుగేంధర్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

రాయదుర్గంటౌన్: పట్టణంలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. పట్టణంలో మొత్తం 6,604 పింఛన్లకు గాను 6,340 మందికి పింఛన్లు అందించారు. 91 స్పాట్ పింఛన్లు కూడా పంపిణీ చేశారు. 2వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప స్పాట్ పింఛన్లు పంపిణీ చేశారు.

కూడేరు: మండల వ్యాప్తంగా శుక్రవారం 96 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. 5,568 మంది పింఛన్‌దారులకు రూ.2,41,36,500 నగదు మంజూరైనట్లు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు.

'అమరమ్' కవితా సంపుటి ఆవిష్కరణ

అనంతపురం/అనంతపురం కల్చరల్: గ్రంథాలయ కళా భవనంలో శుక్రవారం తెలుగు వెలుగు సంస్థ 5వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. సీనియర్ కవి రాధేయ అధ్యక్షతన వహించిన కార్యక్రమంలో టీవీ రెడ్డి రచించిన 'అమరమ్' కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. పలువురు మాట్లాడుతూ.. త్యాగమయ జీవితాలతో సమాజాన్ని మార్చే క్రమంలో అమరులైన వారికి నివాళిగా సాగిన కవితా సంపుటి అందరూ చదవదగినదన్నారు. ఉద్దీపన గీతం ఆలపించిన ఎర్రసితార దాసరి ఆదినారాయణ అందరిని తన గాత్రంతో ఆకట్టుకున్నారు.బండి నారాయణ స్వామి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, జనప్రియ కవి ఏలూరు యంగన్న, తరిమెల అమరనాథరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ, పాట్లూరి హరికృష్ణ, గ్రంథాలయ కార్యదర్శి రమ తదితరులు పాల్గొన్నారు.